# బలికోరిన నిజాయితీ!

-:- సులోచన -:-



జగన్మోహన్ పడక కుర్చీలో పడుకొని సిగిరెట్టు కాల్చు కుంటున్నాడు. ఇంకా కూతురు రాలేదని వాకిలి వంకే చూస్తూన్నాడు.

"నాన్న! నేను ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయినాను. లోపలికి వస్తూ అంది ప్రణీత.

"నువ్వు ఫస్ట్ క్లాస్ తెచ్చుకుంటావని నాకు తెల్సమ్మా" అన్నాడు జగన్మోహన్ కూతురిని మెచ్చుకోలుగా చూస్తూ. భోజనం ఏర్పాట్లు చూడటానికి లోనికి వెళ్ళింది ప్రణీత.

కూతురు పాస్ అయిన సంతోషంలో భార్య పద్మిని గుర్తుకు వచ్చింది. అతనిని జ్ఞపకాల నీడలు వెంటాడాయి.

జగన్మోహన్ మధ్య తరగతి కుటుంబంలో పుట్టాడు. జగన్మోహన్‌కి తల్లి చిన్నప్పుడే పోయింది. తండ్రి ఈ మధ్యనే పోయాడు. అన్న, తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ల వున్నారు. జగన్మోహన్, అన్నకు మతిస్థిమితం లేదు. గాలికి తిరుగుతాడు. ఆకలి వేస్తే అన్నం తింటాడు. ఒకోరోజు అన్నం కూడా తినడు.

జగన్మోహన్ డిగ్రీ చదివి చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తుంటాడు. చిన్న ఉద్యోగంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఉద్యోమే కాక పార్ట్ టైము జాబ్ కూడా చేస్తుంటాడు. చిన్న ఉద్యోగం చేసే టప్పుడే పరిచయం అయ్యింది పద్మిని.

ఒక రోజు పద్మిని వందరూపాయల నోటు తీసుకొని వెచ్చాల కోసం బజారు వెళ్ళింది. ఎవడో ఒకడు పద్మినీకి డాష్ ఇచ్చాడు. పద్మినీ చేతిలో వున్న నోటు జారి క్రింద పడింది. డాష్ ఇచ్చిన వాడు ఆనోటు తీసుకొని పారి పోయాడు.

"దొంగ! దొంగ! పట్టుకోండి! వందరూపాయలు తీసుకువెళుతున్నాడు. పట్టుకోండి" అని పెద్దగా ఏడుస్తూ అరుస్తున్నది. ఎదురుగా వస్తున్న జగన్మోహన్ పరుగెత్తు కెళ్ళి, దొంగను పట్టుకొని, వాడ్ని నాలుగుతన్ని నోటు తీసుకువచ్చి పద్మినీకి ఇచ్చాడు.

"ధ్యాంక్స్ండీ!" అంది కృతజ్ఞతగా.

"ఇందులో ధ్యాంక్స్ చెప్పటానికి ఏముంది లెండ" అన్నాడు జగన్మోహన్.

ఈడబ్బు దొరక్క పోతే యీరోజు మేము పస్తువుండాల్సి వచ్చేది. "మీమేలు యీ జన్మలో మర్చిపోను" అంది పద్మిని.

"అంత మాట వద్దులేండి" అని వెళ్ళిపోయాడు. అప్పుడప్పుడు బజారులో కనపడేది జగన్‌కు పద్మి ని. ఇద్దరూ ఒకరి కష్టాలు ఒకరు చెప్పుకునేవారు.

పద్మినికి మంచంలో పడ్డ తండ్రి, మిషన్ కుట్టి సంపాదించే తల్లి, ఒక చిన్న చెల్లెలు వున్నారు. పద్మినికి చెల్లెలు పుట్టగానే తండ్రి మంచాన పడ్డాడు. అప్పటి నుంచి తల్లి మిషన్ కుట్టి సంపాదిస్తున్నది. బట్టలు కుట్టిన రోజు తినడం లేని రోజు పడుకోవడంగా చెప్పింది పద్మిని జగన్‌కు.

పద్మిని కుటుంబ పరిస్థితి విని మాకంటే అధ్వానంగా వుందే వాళ్ళ కుటుంబం అనుకున్నాడు జగన్.

ఒకళ్లకొకళ్లు దగ్గరయ్యారు. పద్మిని ఏడో క్లాసు తోనే చదువు ఆపేసింది. తండ్రి మంచంలో వుండటంతో తల్లి మిషన్ కుట్టడం వల్ల పద్మినికి యింట్లో పనంతా నెత్తిన పడింది. పద్మినీ వాళ్ళకు కొద్దో గొప్పో సాయం చేస్తుండేవాడు జగన్.

జగన్ చెల్లెళ్లకు పెళ్ళిళ్ళు అయినాయి. కట్నం తీసుకోకుండానే చేసుకున్నారు. కొంత భారం దించిన ట్లైంది జగన్‌కు. జగన్ తమ్ముడికి డిగ్రీ అయింది. పెళ్ళి చేసుకున్నాడు. అతని మామగారు ఉద్యోగం యిప్పించారు. ఇక మిగిలింది జగన్ అతని అన్న.

జగన్ పార్టుటైం ఉద్యోగం చేయటం లేదు. పెద్ద ఉద్యోగం రాలేదు. చిన్న ఉద్యోగంతో వచ్చే జీతం ముగ్గురికి చాలక పోతుందా! అని పద్మినీని గుళ్ళో పెళ్ళి చేసుకున్నాడు.

"జగన్‌కు మంచి జీతం వచ్చే దాకా పిల్లలు వద్దు" అనుకుంది పద్మిని.

పద్మిని అలా అనుకునేటప్పటికే నెల తప్పింది. నెలలు నిండి ఇద్దరు ఆడపిల్లల్ని కన్నది. ఎవరైతే ఏంటీ? అని సరిపెట్టుకొని ఆపరేషను చేయించుకుంది పద్మిని.

జగన్‌కు పార్ట్‌టైం జాబ్‌లు ఏవీ దొరకపోవడంతో పిల్లలిద్దర్ని ఒకేసారి పెంచడం కష్టమైపోయింది. ఆమాటే అంది పద్మిని భర్తతో.

"మంచి రోజులు వస్తాయి పద్మినీ! కష్టాలు కలకాలం కాపురం వుండవు కదా" అన్నాడు జగన్ పద్మినికి ధైర్యం చెపుతూ.

జగన్మోహన్ యింట్లో ఎంత కష్టంగా వున్నా ఆఫీసులో లంచం కోసం చేయిజాపే రకం కాదు. కష్టాల్లోనే మనిషి ధైర్యంగా వుండాలి. కష్టాల్లోనే మనిషి పునీతుడౌతాడు అని అతని విశ్వాసం.

నిజాయితీ అంటే ప్రాణం యిస్తాడు జగన్. ఆదే అతని పాలిట శాపం అవుతుంది. తన తోటి వుద్యోగులు తలోరకంగా సలహాలిస్తుంటారు.




"ఇంట్లో జరుగుబాటు లేనప్పుడు తీసుకుంటే తప్పేమిటని ఒకరు."

"ఈ రోజుల్లో ఒక్క జీతంతో గడపాలంటే నరకం చూడాల్సివస్తుందని, అడ్డదార్లు తొక్కక తప్పదని" ఒకరు.

"జీతం, గీతం కూడా చాలట్లేదు మాకు," అని ఇంకొకరు. వాళ్ళ మాటలు విని కొద్దిగా కూడా చలించడు జగన్.

ఒకరోజు ఆఫీసుకు ఒకతను వచ్చాడు. "ఏవండీ! నాఫైలు అందరి ఫైలు కన్నా ముందు చూసి పెట్టండి మీ రుణం వుంచుకోను." అన్నాడు

"అందరి కంటే ముందు నీ ఫైలు చూడటానికి వీల్లేదు" అన్నాడు జగన్.

"నాఫైలు ముందు చూస్తే మీ రుణం వుంచుకోనన్నాను కదండీ" అన్నాడు.

ఆ ఋణాలు అవి నాకు గిట్టవు. ముందిక్కడ నుంచి బయటకు వెళ్ళండి" అన్నాడు కొద్దిగా కోపంగా.

"ఈ కవరు యిక్కడ వుంచండీ అలా హోటల్ కెళ్ళి కాఫీ తాగి వస్తాను." జగన్ సమాధానం కోసం చూడకుండా వెళ్ళిపోయాడు.

"సాయంత్రం అయిదు అయినా రాలేదే ప్రొద్దున పది గంటలకు వెళ్ళిన మనిషి" అని మనస్సులో అనుకుంటూ వుండగానే పోలీసులు వచ్చారు జగన్ దగ్గరకు.

"లంచం తీసుకున్న నేరానికి మిమల్ని అరస్టు చేస్తున్నాం" అని చేతికి బేడీలు వేశారు. కావాలని తన మీద పగతో యిలా చేశారు." అనుకున్నాడు జగన్.

రెండు రోజులకు యింటికి వచ్చాడు. జగన్‌ను చూస్తూనే పద్మిని పెద్దగా ఏడ్చి "మనకీ ఖర్మ ఏమిటండీ! నిజాయితీకి విలువ లేదండీ!" అంది.

వుద్యోగం పోయినంత మాత్రన నిజాయితీకి విలువ లేదనుకోకు, దీన్ని తలదన్నే వుద్యోగం వస్తుంది" అన్నాడు ధీమాగా. ఇరవై వేలకు జగన్ సీటు అమ్ముడు పోయిందన్న విషయం జగన్‌కు తెలీదు.

ఉద్యోగం కోసం తిరిగి తిరిగి జగన్‌కు చెప్పులతో పాటు కాళ్ళు కూడా అరిగి పోయాయి. అయినా ప్రయోజనం లేదు. ఇంట్లో బియ్యం, సరుకులు నిండుకున్నాయి. పిల్లలకు పాలడబ్బా అయిపోయింది.

దరిద్రానికి మించిన బాధ మనిషికి మరొకటి లేదు. జగన్ జీవితం రోజు రోజుకు దుర్భరం అయిపోయింది. పూట గడవటం కష్టంగా వుంది. ఎవరినన్నా సహాయం అడగాలంటే జగన్‌కు అభిమానం. పిల్లలను ఎలా సముదాయించాలో పద్మినికి తోచడం లేదు. పంచదార వేసి నీళ్ళు పడదామన్నా పంచదార కూడా లేదు ఇంట్లో. మంచి నీళ్ళు పట్టింది. నీళ్ళతో కడుపు నిండే సరికి పిల్లలిద్దరూ నిద్రపోయారు.

పద్మినికి ఆలోచనలు ఈగల్లాగా ముగురుతున్నాయి. తళుక్కున మెరిసింది ఆలోచన పద్మినికి.

మెళ్ళో మంగళ సూత్రాలు తీసి పసుపు కొమ్ము కట్టుకొని బజారుకు వెళ్ళింది.

"యీ మంగళ సూత్రాలు ఎంతకి

కొంటారు?" అనడిగింది పద్మిని. ఒకసారి ఎగాదిగా చూసి

"ఇవి అయిదు చిన్నాలు కంటే వుండవమ్మా"అన్నాడు.

"డబ్బు ఎంత వస్తుందో చెప్పండి" అంది అసహనంగా.

"నూట యాభై యిస్తాను" అన్నాడు కంసలతను.

"రెండు వందలు చేసుకోండి" అన్నది పద్మిని

"అంత తేడాగా చెప్పలేదు" అన్నాడు.

"పోనీ నూట అరవై చేసుకోండి" . అన్నాడు.

"సరేలే అని నూట అరవై పద్మిని చేతిలో పెట్టాడు."

పైన నూట అరవై పెట్టి సరుకులు తీసుకొని, మందులషాపుకు వెళ్ళి నిద్ర మాత్రల సీసా తీసుకొంది.

వందరూపాయలు టేబుల్ మీద పెట్టి ఒక ఉత్తరం రాసి పెట్టింది. నీళ్ళల్లో పంచదార కలిపి అందులో నిద్ర మాత్రల సీసా కుమ్మరించి, పిల్లలిద్దరికి చెరి కాసిని నీళ్ళు పట్టి మిగిలినవి తను త్రాగి పడుకుంది పద్మిని.

ఆరోజు వుద్యోగం వేట కోసం పొద్దునే వెళ్ళాడు జగన్. అతడు తిరిగి యింటికి వచ్చేటప్పటికి రాత్రి తొమ్మిది అయింది." అందరూ నిద్రపోతున్నారే అనుకున్నాడు. బట్టలు విప్పి వంకీకి తగిలిస్తుంటే టేబుల్ మీద డబ్బు కాగితం కనపడింది.

"డబ్బు ఎక్కడిదబ్బా. ఆ వుత్తరమేమిటా అనుకొని చేతిలోకి తీసుకున్నాడు.

"ఏమండీ!"

నేను నష్టజాతకురాలినండీ! మీ కష్టాలన్నిటికీ నేనే కారణం. నేను మీ జీవితంలోంచి తొలగి పోతేగాని మిమల్ని అదృష్టం వరించదు. మంగళ సూత్రాలు అమ్మిన డబ్బు యిది. వాడుకోండి. నన్ను చేసుకున్న తరువాతే మీకు వుద్యోగం పోవడం జరిగింది. మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి. పిల్లల్ని కూడా నాతో పాటు తీసుకువెళుతున్నాను.

ఇట్లు
మీ
పద్మిని.

చేతులు వణికాయి జగన్‌కి.

"పద్మినీ! అని పిచ్చిగా పద్మిని మీద పడి ఏడుస్తున్నాడు. పిల్లలిద్దర్ని తాకి చూశాడు. ఒక పిల్ల ఒళ్ళు చల్లగా ఐసులాగా వుంది. ఒక పిల్ల వళ్ళు మాత్రం చల్లగా లేదు. జగన్ ఏడుపుకు ప్రక్కవాళ్ళు పరిగెత్తుకు వచ్చారు.

ఒళ్ళు చల్లగా లేని పిల్లను తీసుకొని డాక్టరు దగ్గరకు వెళ్ళారు" పిల్ల బ్రతకటం కష్టం అన్నాడు.

సిలైన్ ఎక్కించాడు. శ్రద్ధగా ట్రీట్‌మెంట్ చేశాడు. పిల్ల బ్రతికింది.

పద్మిని పోయిన తరువాత పద్మిని జ్ఞపకాలతో ఆ వూళ్ళో వుండలేక కూతుర్ని తీసుకొని హైదరాబాదు చేరాడు. హైదరాబాదు రాంగానే జగన్ వాళ్ళ అన్నయ్య చనిపోయాడు.

ఒక ప్రైవేటు కంపెనీలో మేనేజరుగా చేరాడు. ఇప్పుడతనికి ఆర్థికంగా ఏ బాధా లేదు. ప్రణీతను కంటికి రెప్పలాగా పద్మిని గుర్తుగా పెంచాడు.

"నాన్నా! పిలుస్తుంటే పలకవేం" అంది ప్రణీత ఆపిలుపుతో జ్ఞపకాల్లోంచి బయటకు వచ్చాడు.

"ఏంటమ్మా ప్రణీ!"

"ఎన్ని సార్లు పిలిచానో తెల్సా!"

"అలాగా! నాకు తెలీ లేదమ్మా!"

"ఆలోచిస్తున్నావేంటి నాన్నా" అనడిగింది ప్రణీత.

"మీ అమ్మ జ్ఞపకం వచ్చిందమ్మా ఉంటే ఎంత సంతోషించేదో! దురదృష్టవంతురాలు తొందర పడి ప్రాణం తీసుకుంది" అన్నాడు ఆవేదనగా.

అమ్మ దురదృష్టవంతురాలు కాదు నాన్నా! ఆ దురదృష్టం నాదే "తల్లి ప్రేమకు నోచుకొని దౌర్భాగ్యురాలిని!" అని కంట తడి పెట్టింది ప్రణీత.

"ప్రణీత! ఏడవకు"

"నీకంట నీరు కారితే నేను చూడలేను" అన్నాడు. సినిమా డైలాగు టైపులో ప్రణీతను నవ్వించాలని.

ఫక్కున నవ్వింది ప్రణీత తండ్రిని చూసి.


"నా నిజాయితీనే పద్మినిని బలిగొన్నది." అనుకున్నాడు బాధగా. ❋

# సర్వరోగనివారిణి పసుపు

**భా**రతదేశ నాగరికత, సంస్కృతిలో పసుపుకు విశిష్టమైన స్థానమే ఉంది. పసుపు లేకుండా వివాహాది మహోత్సవాలేకాదు, ఎటువంటి శుభకార్యామూ మన దేశంలో జరగదంటే అతియోశక్తికాదు. పసుపు సౌందర్య సాధనంగానేకాక, ఆరోగ్యపరంగా కూడా ఎన్నో ప్రయోజనాలు కల్గిస్తోంది.

పసుపుకొమ్మును నీళ్ళతోనూరి ఆ పేస్ట్‌ను పుండ్లపై రాస్తే పుండ్లు మానిపోతాయి. పసుపు కొమ్మును కాల్చి రసం తీసి నీటితో సేవిస్తే కఫంతో కూడిన దగ్గు తగ్గుతుంది. పసుపుకు వేడి, ఘాటైన లక్షణం ఉండటం వలన ఆ పొడిని వేడి నీటిలో వేసి కాపడం పెడితే ముక్కుదిబ్బడ, జలుబు వంటివి నయమవుతాయి.

గంధం, కొబ్బరి నూనెతో పసుపును కలిపి పేస్ట్‌లా తయారుచేసి దాన్ని బ్యూటీ మాస్క్‌గా మొహానికి, దేహానికి రాసుకోవచ్చు. తద్వారా మేని బంగారుకాంతులీనుతుంది. పైగా మొహంపై మొటిమలు రానీకుండా ఇది నివారిస్తుంది. అయితే



పసుపును మోతాదుకు మించి నిత్యం వాడితే చర్మం బిరుసెక్కి మొహం ముదురుగా మారే ప్రమాదం ఉంది.

కాళ్ళపాచితో బాధపడేవారు రాత్రిపూట కొబ్బరినూనెలో పసుపు కలిపి కాళ్ళకు రాసుకుని పడుకోవాలి. ఇలా వారం రోజులు చేస్తే ఫలితం కన్పిస్తుంది. చర్మవ్యాధుల వల్ల మచ్చలు ఏర్పడితే పసుపులో నిమ్మకాయరసం పిండి దాన్ని మచ్చలపై రాస్తే అవి మటుమాయం అవుతాయి. నువ్వుల నూనె, వేపాకు, ఉప్పుతో కలిపి పసుపును మెత్తగా చూర్ణంగా చేసి దేహానికి పట్టిస్తే గజ్జి, తామర వంటి చర్మవ్యాధులు తగ్గుతాయి. గ్లాసెడు నీళ్ళలో చిటికెడు పసుపువేసి పుక్కిలించితే నోటి దుర్వాసన, చిగుళ్ళవాపు, నోటిలోని పుండ్లు నయమవుతాయి.

సుగంధద్రవ్యంగా ఆహారపురంగును పూర్తిగా మార్చి సువాసనలు అందించే గుణం పసుపుకు ఉంది. ఆహారపదార్థాల్లో పసుపును వాడటం వల్ల జీర్ణక్రియ వ్యవస్థ చురుకుగా ఉండటమేకాక పూర్తిస్థాయిలో ఉత్తేజంగా పనిచేస్తుంది. ఇది యాంటిబయాటిక్‌గా కూడా పనిచేస్తుంది. రక్తాన్ని శుభ్రపరుస్తుంది.

– సూదా శివరామకృష్ణ